

# వానకారు కోయిల

## - మన్నెం శారద



*(గత సంచిక తరువాయి)*

**పరిమళ గబగబా** ఆస్పత్రిలోనికి వెళ్ళింది.

ఆమె ముఖం చూడగానే జగన్నాధరావుగారు అదోలా అయ్యారు.

"అదేం అనసూయా అలా ఉన్నావు?" అన్నారు కంగారుగా.

పరిమళకి దుఃఖం తన్నుకొస్తోంది. జరిగిన సంగతంతా చెప్పి భోరుమని ఏడవాలనిపిస్తోందామెకు. కానీ నిగ్రహించుకుంది.

"అసలే ఆయన హార్టు పేషంటు. విని ఏమన్నా అయితే?"

"ఏంలేదు, ఏంటో చాలా నీరసంగా వుందంతే" అంటూ స్టూలు మీద కూలబడింది.

"నువ్వు నిజమే చెబుతున్నావా? ఎప్పుడూ నువ్వింత డీలా పడగా చూడలేదు" అన్నారాయన సాలోచనగా చూస్తూ.

"నిజమే డబ్బులేక నడిచొచ్చాను. ఎక్కడ అడయార్ ?ఎక్కడ ఎగ్మూరు" అంది పరిమళ మాట మారుస్తూ.

"అరె నన్నడిగి తీసుకోలేకపోయావా? లేకపోతే అమ్మాయినడగలేక పోయావా?" అన్నారు.

"అమ్మాయి నిద్రపోతోంది. లేపడం యిష్టంలేక వచ్చేసాను."

"ఇంతకీ అమ్మాయెలా వుంది? నన్ను చూడ్డానికీరోజు కూడా రాలేదు" అన్నారాయన కాస్త బాధగా.

"వస్తుందిలెండి. అల్లుడుగారు ఈమధ్యనేగా రావడం. చాలా రోజులకి కలుసుకున్నారు కదా. వయసొచ్చిందేగానీ కొన్ని సంగతులు అర్థంకావు" అంటూ విసుక్కుంది పరిమళ.

జగన్నాధరావుగారు సన్నగా నవ్వారు.

"అలాగయితే ఫర్వాలేదు. ఇంతకీ వాళ్ళిద్దరూ సఖ్యతగానే వుంటున్నారన్నమాట"

"ఆఁ" అంది పరిమళ.

"మే అయి కమ్ ఇన్ సైడ్" జగదీష్ చిన్నగా దగ్గి గుమ్మం దగ్గర నిలబడ్డాడు.

"రా బాబూ రా" అన్నారు జగన్నాధరావుగారు.

పరిమళ అతన్ని చూసి పక్కకి నిలబడింది.

జగదీష్ ఆమెని గమనించనట్లు జగన్నాధరావుగారి ఎదురుగా స్టూలుమీద కూర్చుని "ఎలా వుంది మీకు?" అన్నాడు ఆత్మీయంగా.

"అయామ్ ఆల్ రైట్. రేపు నన్ను డిశ్చార్చి చేస్తామన్నారు" అన్నారు ఉత్సాహంగా.

"ఐ సీ" అన్నాడు జగదీష్.

నువ్విన్నిసార్లు వస్తున్నావుగాని అమ్మాయి నన్ను చూడ్డానికే రావడంలేదు" అన్నారాయన నిష్ఠూరంగా

జగదీష్ చిన్నగా నవ్వి వస్తుందిలెండి. కొంచెం తనకి వంట్లో బాగుండటంలేదు" అన్నాడు.

జగన్నాధరావుగారు కంగారు పడ్డట్లు చూసి "ఏమయింది బేబీకి?" అనడిగారు.

"కంగారు పడాల్సిందేమీ లేదు. షి యీజ్ కేరీయింగ్" అన్నాడు జగదీష్ తల దించుకుని.

జగన్నాధరావుగారి బుగ్గల్లోంచి సంతోషం తన్నుకొచ్చింది.

"ఈ మాట నిజమా అల్లుడూ' అన్నారు ఆశ్చర్యంగా.

"కాకూడదా? ఇప్పటికే టూ లేట్" జగదీష్ నవ్వుతుంటే పరిమళ ఆశ్చర్యపోయినట్లు చూసింది.

"అన్నట్లు చెప్పడమే మరచిపోయాను. పరిమళా నువ్వు యింటికి వెళ్ళు. మరో ఆడమనిషి అవసరం ఎంతయినా వుంది వాసవికి. మామగారి సంగతి నేను చూసుకుంటాను" అన్నాడు జగదీష్ పరిమళవైపు చూస్తూ.

పరిమళ తెల్లబోయినట్లు చూసింది.

"ఇందాకనే కదా తన ముఖాన డబ్బు విసిరి యింట్లోనుంచి వెళ్ళగొట్టింది. అప్పుడే తిరిగి రమ్మనడంలో అతని ఉద్దేశ్యం ఏమైవుంటుంది?" ఆలోచిస్తోంది పరిమళ.

"నాకేం. శుభ్రంగా వున్నాను. రేపు నేనెలాగూ డిశ్చార్జయి వచ్చేస్తున్నాగా, ఈ లోపున అమ్మాయికేం కావాలో చూడు" అన్నారు జగన్నాధరావుగారు.

"అసలే ఇటు అత్తగారు కాని అటు తల్లికాని లేకపోవడం వాసవి దురదృష్టం. ఈ టైములో నేనెంత బాగా చూసినా అనుభవం మీద సలహా యిచ్చే ఆడతోడు కావాలి" అన్నాడు జగదీష్ బాధగా.

పరిమళ తల్లి హృదయం రెపరెపలాడింది.

"వాసవికి తల్లి వుంది" అని అరవాలనిపించిందామెకు.

"వెంటనే పదండి, వస్తాను" అంది గబగబా.

జగదీష్ పైకి లేచి "వస్తాను మామగారూ" అంటూ బయటకొచ్చాడు. పరిమళ అతన్ననుసరించింది.

"ఏంటి ఆలోచిస్తున్నావు?" అడిగాడు జగదీష్ వ్యూ మిర్రర్‌లోంచి ఆమెను గమనిస్తూ.

"ఏం లేదు బాబూ" అంది పరిమళ తడబాటుగా.

"వాసవిని కొట్టాను కదా ఆమె దగ్గరకి రానిస్తుందో లేదోనని కదూ"

పరిమళ పట్టుబడిన దొంగలా చూసింది. "అవును బాబూ" అంది మెల్లిగా.

"తల్లిలాంటి ఆడదానివి. తప్పు చేసినప్పుడు దండించడంలో తప్పేముంది?"

"కాని.. అమ్మాయి అర్థం చేసుకోవద్దూ" అంది బాధగా.

"వాసవిది కాస్త మంకు పట్టు. ఆమెకు తండ్రి స్వభావం చాలా వచ్చేసింది."

"లేదు బాబూ ఆ పౌరుషం పట్టుదలా అంతా నాదే"

జగదీష్ పరిమళవైపు అదోలా చూసాడు.

చేసిన పొరపాటు గ్రహించి నాలుక్కరుచుకుంది పరిమళ.

"నా దగ్గర దాపరికమెందుకు? వాసవి మీ కూతురు కదూ అత్తయ్యగారూ?" జగదీష్ ఎంతో మర్యాదగా అడుగుతుంటే కాదని అబద్దం చెప్పలేకపోయింది పరిమళ.

"నేను ఏ బంధుత్వమాశించి ఈ యింట్లో అడుగుపెట్టలేదు బాబూ. యాదృచ్ఛికంగా ఆయన్నీ, వాసవిని కలుసుకుకోగలిగాను. కన్న కడుపు కాబట్టి కూతురి జీవితం నాశనం కాకూడదనే ఆవేశంతో బయటపడిపోయాను. వాసవి చేసిన తప్పుని కడుపులో దాచుకుని ఆమెని ఆదరిస్తున్న నీ ఔదార్యానికి చిన్నవాడయినా చేతులెత్తి నమస్కరిస్తున్నాను. ఆ దరిద్రుణ్ణి వెళ్ళగొట్టేసి అమ్మాయి బ్రతుకు చక్కదిద్దుకో బాబూ" అంది రుద్ధకంఠంతో.

జగదీష్ అదోలా చూసాడు.

"మీకా బెంగ అక్కర్లేదు. అతన్ని పంపించేస్తాను. వాసవికి పుట్టబోయే సంతానానికి నేనే తండ్రిని" అన్నాడు జగదీష్.

"బాబూ" అంది పరిమళ సంతోషంతో మాటరాక.

కారు దారి మళ్ళి వెళ్ళడం గమనించి ఆశ్చర్యంతో "ఇటెక్కడికి?" అంది పరిమళ.

"చిన్న పనివుంది. ఇక్కడ నాకొక స్నేహితుడున్నాడు" అన్నాడు జగదీష్.

పరిమళ మెల్లిగా కళ్ళు మూసుకుని డోర్‌కి జేరబడి కూర్చుంది.

కారు ఒక కాటేజ్‌లాంటి యింటిముందాగింది.

జగదీష్ దిగి బాక్‌డోర్ తెరచి "దిగండి" అన్నాడు.

పరిమళ కళ్ళు తెరచి "నేనెందుకు?" అంది ఆశ్చర్యంగా.

"చిన్న పని వుంది. రండి. వీళ్ళందరూ మన స్నేహితులే" అన్నాడు ఆత్మీయంగా.

పరిమళ కారుదిగి అతన్ని అనుసరించింది. లాక్ చేసి వున్న కాటేజ్ తలుపులు తెరిచాడు జగదీష్.

అతను లోనికి వెళ్తుంటే పరిమళ అనుమానంగా అడిగింది.

"ఎవరూ లేనట్లున్నారే?" అంటూ.

"ఎటో వెళ్ళినట్లున్నారు అయినా నా దగ్గర డూప్లికేటు వుంటుంది" అన్నాడతను.

పరిమళకి అతను చెప్పేది అర్థం అవలేదు. అయినా అతన్ననుసరించి లోనికెళ్ళింది.

పరిమళ మరో గదిలోకి వెళ్ళగానే బయటనుండి బోల్టు వేసి కిటికీలోంచి చూసి నవ్వాడు జగదీష్.

పరిమళ నివ్వెరపోయి "బాబూ" అంది ఆశ్చర్యంగా.

"ఒక వళ్ళమ్ముకునే బిచ్ నాకు అత్తగారా? ఈ నిజాన్ని నేను ఎలా అంగీకరిస్తాననుకున్నావు. పైగా అనంత్‌కి, వాసవికి వున్న సంబంధం తెలిసిన ఒకే ఒక మనిషివి నువ్వు. ఆ నిజాన్ని సమాధి చెయ్యాలంటే నిన్ను..." అంటూ ఆగాడు జగదీష్.

పరిమళ మ్రాన్పడి చూసింది.

"నాకే బంధుత్వాలు, మర్యాదలు అక్కర్లేదని చెప్పానుగా. నా చిట్టి తల్లి క్షేమం ఒక్కటే కాంక్షించేది. నేను చచ్చిపోయినా ఫర్వాలేదు. నా బిడ్డని మాత్రం క్షేమంగా చూసుకో" అంది పరిమళ బాధగా.

"ఆ నీతులు నువ్వు వల్లించనక్కరలేదు. ఎవర్ని ఎలా చూడాలో నాకు బాగా తెలుసు. నీకు దేవుణ్ణుండి పిలుపు వచ్చేవరకు నువ్విక్కడే మగ్గు. మీకిక్కడ త్రాగడానికి మంచినీళ్ళు కూడా దొరకవు మైడియర్ అత్తగారూ. ఎదురుగా కనిపిస్తున్న సముద్రాన్ని చూసి దాహం తీర్చుకోండి బై! బై" అంటూ తాళాలు ఊపుకుంటూ ముందుకి నడిచాడు జగదీష్.

అతను వెళ్ళిపోతుంటే ఒకరకమైన విభ్రాంతితో కిటికీ ఊచలు పట్టుకుని అలాగే నిలబడిపోయింది పరిమళ.

37

బలరాంకి కొద్దిగా స్పృహ వచ్చింది.

అయినా బాధకి గట్టిగా మూలుగుతూనే వున్నాడు.

అతని బెడ్‌కి ఎదురుగా డిటెక్టివ్ ధవళాచలం, మరో సి.ఐ.డి ఆఫీసరు, మెజిస్ట్రేట్ కూర్చుని ఉన్నారు.

గుమ్మానికి అవతల ఇద్దరు కానిస్టేబుల్స్ రైఫిల్సు పట్టుకుని నిలబడి వున్నారు.

శంకర్ బలరాం బెడ్‌కి దగ్గర్లో నిలబడి వున్నాడు.

ధవళాచలం శంకర్ వైపు చూసి ప్రొసీడవ్వమన్నట్లు సైగ చేసాడు.

"గురూ ఎలా వుంది నీకు? శంకర్ బలరాం చెవి దగ్గరగా నోరు పెట్టి గట్టిగా అడిగాడు.

"అబ్బా!" మూలిగాడు బలరాం గట్టిగా.

"బాగా నొప్పిగా వుందా నీకు?"

బలరాం చిన్నగా కళ్ళు తెరచి చూసాడు.

"నేనెక్కడ వున్నాను?

"ఆస్పత్రి. ఏక్సిడెంటయిందిగా నీకు?" శంకర్ గుర్తు చేసాడు.

డాక్టర్ వచ్చి బలరాం పల్స్ చూసాడు.

అతనివైపు చూసారు ధవళాచలం, మేజిస్ట్రేటు.

"ఇతని ఆయుష్షు ఇంకొన్ని గంటలు కావొచ్చు. మీరు త్వరగా స్టేట్‌మెంట్ తీసుకోవడం మంచిది" అన్నాడు డాక్టర్.

"ఇతనివల్ల ఎన్నో నిజాలు తెలియాల్సి వుంది. దయచేసి వీలయితే బ్రతికేట్టు చూడండి."

"నో వీలుకావడమంటూ లేదు. ఇంకా మీరు లక్కీ అతను స్పృహ వచ్చి మాట్లాడగలుగుతున్నాడు" అన్నాడు డాక్టరు.

మెజిస్ట్రేటు ముందుకి జరిగాడు.

ధవళాచలం శంకర్ భుజం తట్టాడు.

"అవునా ఆ రోజు బాగా తాగేసాను. బ్రేకులు ఫెయిలయి బండికింద తొంగుండిపోయాను" అన్నాడు బలరాం గుర్తుకు తెచ్చుకుంటున్నట్లుగా.

"నీ బ్రేకులు బాగానే వున్నాయి. ఆడే. కావాలని నీ మీద బండెట్టేసాడు."

శంకర్ మాటలకి చిన్న సంచలనం బయల్దేరింది బలరాంలో.

"ఎవడ్రా ఆడు? జగదీష్‌గాడా?" అంత బాధలోనూ కోపంగా.

"కాదు. అనంత్. అంటే జగదీష్ సెక్రటరీ" శంకర్ గట్టిగా చెప్పాడు.

"...రేయ్ ఎంత ధైర్యంరా నీకు. నా మీన బండెట్టేంత మొనగాడివయేవ్‌రా నేను ఆస్పత్రి నుంచి రానీరా. నీ పని బడతాను. ఆ జగదీష్ గాడే, ఆ సేతకాని దద్దమ్మే నిన్ను నా మీనకి ఉసిగొల్పేడురా. ఏది నొక్కితే ఆడికి ఎక్కడ నొప్పెడతదో నాకు అబ్బ" అంటూ మూలిగాడు బలరాం.

వాడి మాటల్ని ధవళాచలం. మేజిస్ట్రేటు చాలా జాగ్రత్తగా వింటున్నారు.

"బలరాం" శంకర్ చాలా ప్రేమగా పిలిచాడు.

"ఊ!"

"చాలా నొప్పిగా వుందా?"

"వళ్ళంతా ఒకటే మంట. పచ్చడి చేసినట్లు."

"నీకో నిజం చెప్పనా? బాధపడవుగా?"

"ఉహూ!"

"నువ్వాళ్ళని ఏ చేయలేవు."

"...రేయ్ ఏంట్రా ఆ కూతలు. ఇప్పుడు ఆస్పత్రి బెడ్ మీదున్నానని. నా గురించి"

"అది కాదు. డాక్టర్లు చెప్పారు నువ్వు బ్రతకవని."

బలరాం కళ్ళలో నీళ్ళూరాయి.

బాధతో శంకర్ వైపు చూసాడు.

శంకర్ కళ్ళలో కూడా సన్నటి నీటి పొర.

అంత బాధలోనూ బలరాం పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

"ఒరేయ్ నువ్వేడుస్తున్నావంట్రా? అదీ నా కోస్మ నిజంగా నాకిప్పుడు - సాలా - సాలా సంతోషంగా వుందిరా! ఎందుకో తెలుసా? నా కోసం... నా కోసం ఈ బూమ్మీద ఏడిసే ప్రాణి వున్నదంటే హేపీరా శానా హేపీ"

"నీతో కలిసి తిరిగాను. నీతో కలిసి తిన్నాను. నువ్వు సచ్చిపోతంటే నాకేడుపు రాదా? ఆ సంగతికేం గాని నేను నిన్ను సంపినోడిమీద కచ్చి తీర్చుకుంటాను. నువ్వు జగదీష్ సంగతులన్నీ సెప్పేయ్"

బలరాం తేలిగ్గా నవ్వాడు.

"నీ ముఖం ఆడిమీదకి నువ్వేం సాల్తావురా? వళ్ళు బలిసినోడి మదం అణసొచ్చుగాని డబ్బుతో బలిసినోణ్ణి ఎవరూ ఏం సేయలేర్రా. ఈ రోజు నేను పోతే మరో ఎంకటరావ్ దొరుకుతాడు ఆడికి. కుక్కకి బిస్కట్టు పారేసినట్లు డబ్బు పారేసి పనులు సేయించుకుంటారు ఆళ్ళు. నువ్వు పసోడివి. ఆళ్ళ జోలికెల్లమాకు. నీ దారి నువ్వు సూసుకో. దూరంగా ఎల్లిపో."

"నువ్వు అంచనా నన్ను తక్కువగా అంచనా వేస్తున్నావు. అటు సూడు. నీకు ఉపకారం సెయ్యాలని ఆ జగదీష్ గాడి అంతం సూడాలని ఎంతమంది కనిపెట్టుక్కూర్చున్నారో. చిన్నోణ్ణని తేలిగ్గా తీసెయ్యక ఎంటనే అన్నిసంగతులూ సెప్పేయ్. నువ్వు సెప్పకపోతే ఆ జగదీష్గాడు మోర యిరుచుకుని యింకా ఎంతోమందిని నంజుకు తింటాడు." అన్నాడు శంకర్ ఆవేశంగా.

బలరాం మెల్లిగా తల తిప్పి చూసాడు.

అతని కళ్ళకి మసక మసగ్గా ఎదురుగా కూర్చున్న వ్యక్తులు కనిపించారు.

"ఎవరాళ్ళంతా?"

"పోలీసోళ్ళు. పెద్ద పెద్ద ఆఫీసర్లు అందుకే సచ్చిపోయేటప్పుడయినా అన్నీ నిజాలు చెప్పేసెయ్" అంటూ తొందర పెట్టాడు శంకర్.

బలరాం పెదవులపై పేలవమైన చిరునవ్వు జారిపోయింది.

"సెబుతాను. సచ్చిపోయే ఈ ఆఖరి చరణం అబద్దాలాడి  నేను బావుకునేదేవుంది? అంతా నిజమే చెబుతాను."

మేజిస్ట్రేటు ముందుకి వంగి పేడ్ వళ్ళో పెట్టుకుని రాసుకునేందుకు రెడీగా కూర్చున్నాడు.

"నా పేరు అప్పడు. విజీనగరం దగ్గర తగరపాలస - నా ఊరు. ఆ ఊరి మోతుబరి సివ్వాద్రినాయుణ్ణి ఖూనీ సేసి పారిపోయిన అంతకుడ్ని నేనే."

ధవళాచలం కళ్ళు విశాలమయ్యాయి.

మేజిస్ట్రేట్ ఆయన ముఖ ముఖాలు చూసుకున్నారు.

"ఆ రోజున ఆడిని సంపిది నక్సలైట్లనుకున్నారు పోలీసోళ్ళు. ఆడు నా పొలం కుదవెట్టుకుని దానికి వడ్డీకి వడ్డీ పెంచి నా సేత అరవ సాకిరీ సేయించుకున్నాడు. అది సాలక ఒక రోజు నా పెళ్ళాన్ని సెరిచాడు. అదేమని అడిగితే "సుకపడ్డం ఆడి అక్కు ఏడవటం నాలోంటి బీదోడి కర్మ." అని నవ్వాడు. కడుపు మండిన నేను ఆడ్ని సంపేసాను. ఇంటికొచ్చి సూస్తే నా పెళ్ళాం ఉరిపోసుకు సచ్చింది. సేసేదిలేక పారిపోవాలని రైలెక్కాసాను. టిక్కెట్టు లేదు. అది ఫస్టుక్లాసంట. టి.సి వచ్చాడు. నేను దొడ్లో దాక్కున్నాను. ఆడెల్లిపోయాక బయటకొచ్చాను. అక్కడ పేపరు సదూకుంటూ కూసున్న బాబొకడు నా యివరాలడిగాడు. తనతో వస్తే నన్ను కాపాడతానన్నాడు ఆడే జగదీష్. ఆడు నాకు తమ్ముడూ కాదు బావా కాదు. ఆడు నాకొక పని అప్పసెప్పాడు. ఆడికి అందమైన పెళ్ళాం వుంది. పేరు సాయిత్రి. ఆడు సెప్పిన పని సేస్తే నాకెంత డబ్బయినా యిస్తానన్నాడు. నా మకాం పూన మల్లెయి రోడ్డులో ఏర్పాటు సేసాడు. ఆడు సెప్పిన పెకారం బలరాం" మెల్లిగా శ్వాస తీస్తూ చెప్పుకుంటూ పోతున్నాడు.

అందరూ ఎంతో నిశ్శబ్దంగా చెవులు రిక్కించి వింటున్నారు.

మరో పక్క వాడి స్టేట్ మెంట్ రికార్డవుతూ వుంది.

అర్ధరాత్రి దాటింది.

వాసవి ఎన్నో విధాలుగా ఆలోచిస్తోంది.

ఆమె మనసు ఎటూ తూగటం లేదు.

ఒక క్షణం అనంత్ వేపు లాగి మరో క్షణం జగదీష్ వైపు మొగ్గుతోంది. ఇప్పుడు తనేం చెయ్యాలి?

జరిగిందేదో జరిగిపోయిందనుకుని జగదీష్‌తో సర్దుకుపోవాలా? అలా చేస్తే తనకి సంఘంలో చెడ్డపేరు రాదు. సమాజంలో తనకి గౌరవమైన స్థానం వుంటుంది. మన సమాజంలో అలాంటి వాళ్ళే ఎక్కువ.

చాలామంది మంచిగా బ్రతకడానికి ప్రయత్నించరు కానీ మంచి పేరు సంపాదించాలని ఆరాట పడ్తారు. తనుకూడా ఆ దారే త్రొక్కాలా?

తొక్కి అనుక్షణం తన మనసు చేస్తున్న ఆందోళనని అణచుకుని బ్రతకగలడా?

అనంత్ పైన పెంచుకున్న మమకారాన్ని ఏర్పడిన అనుబంధాన్ని త్రుంచేయగలదా?

ప్రతి క్షణం పెరుగుతున్న అనంత్ ప్రతిరూపాన్ని జగదీష్‌దిగా భావించి అంతరాత్మని మోసం చేయగలదా? అదెలా సాధ్యం?

ఎన్నో ఆదర్శాలని, అభిరుచుల్ని పెంపొందించుకున్న తన వ్యక్తిత్వం చివరికిలా సుడిగుండంలో చిక్కుకు పోయిందేమిటి?

ఇద్దరి పురుషుల మధ్య మరబొమ్మలా మారిపోయిందేమిటి? కానీ జగదీష్ అతని మంచితనంతో తనని వంచేస్తున్నాడు.

తన నిర్ణయాన్ని మెత్తబరచి సందిగ్ధంలో పెట్టేస్తున్నాడు ఏమిటతని మనస్తత్వం?

నిజంగా అతను తననంతగా ప్రేమిస్తున్నాడా?

లేక పరువు పోతుందని భయపడుతున్నాడా?

ఇన్నాళ్ళూ తనని నిర్లక్ష్యంగా చూసి చేజారి పోతున్నానని తెలిసి యిలా నాటకం ఆడుతున్నాడా?

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments